క్లుప్తంగా

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ



ఏలేశ్వరంలో గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యావేత్తలు విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు కథలు చెప్పడం, కథనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనంపై శిక్షణ నిచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సత్యనారాయణ సూచించారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత, లలితా సహస్ర పారాయణ

ఏలేశ్వరం: స్థానిక మార్కెట్ వీధిలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో శనివారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత, లలితాసహస్ర, విష్ణు సహస్ర పారాయణలు చేశారు. అనంతరం పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధి తూమురౌతు గురయ్య, సంఘ మహిళా సభ్యులు మల్లేశ్వరి, కల్యాణి, రమ్య , మంగామణి, కామాక్షి, రేవతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ఏలేశ్వరం: పట్టణంలో సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. స్థానిక దిబ్బలపాలెం గ్రంథాలయం సమీపంలో ఆలయ కమిటీ, పట్టణ పెద్దల సహకారంతో రామాలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులకు శనివారం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శిడగం త్రివేణి దంపతులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

కిర్లంపూడి: స్థానిక ఎస్సీపేట శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కిర్లంపూడి ఎస్సీపేట శివారులో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5050 స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ సిబ్బంది గణేష్, శివ, హోమ్‌గార్డు మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేదపండితులు చిట్టి శివ ఘనపాఠి, రమేష్ ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, యండవిల్లి వెంకటేశ్వరరావు, ఆలయ ఏఈఓ కృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి

జగ్గంపేట: రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపు లేదని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంచినా పరిశ్రమలు, గృహాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై దృష్టి సారించాలన్నారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రోత్సాహం నిండుగా.. సాగు పండగ

- వ్యవసాయంపై రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సిడీపై యంత్ర పరికరాలు
- జగ్గంపేట మండలంలో రైతులకు 1.86 కోట్ల విలువైన ఆధునిక పనిముట్ల పంపిణీ
- ఆర్‌బీకేల ద్వారా మెరుగైన సేవలు



జగ్గంపేటలో రైతు సంఘం ద్వారా తీసుకున్న ట్రాక్టర్



వైఎస్సార్ రైతు సేవా పథకంలో తీసుకున్న వరికోత యంత్రం



కాండ్రేగుల గ్రామంలో రైతులకు సబ్సిడీపై అందజేసిన రోటోవీడర్

జగ్గంపేట: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోంది. రైతు సంఘాలకు ఆధునిక యంత్రాలు, పనిముట్లను సబ్సిడీపై అందచేసి తద్వారా రైతులకు అన్ని రకాల యంత్రాలు, పనిముట్లను చేరువ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా మండలంలో రూ.1.86 కోట్ల విలువైన 51 పనిముట్లు, యంత్రాలను సబ్సిడీపై రైతు సంఘాలకు అందజేశారు.

24 ఆర్‌బీకేల పరిధిలో..

జగ్గంపేట మండలంలో 24 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఐదుగురు చొప్పున రైతులతో సంఘాలు ఏర్పాటు చేశారు. ఈ సంఘాలు కస్టమ్ హైరింగ్ సెంటర్లుగా పని ప్రారంభించాయి. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్స్, రోటో వీడర్స్, పవర్ స్ప్రేయర్స్, వరి కోత మెషీన్లతో పాటు రైతులకు సాగులో అవసరమైన యంత్రాలు, పనిముట్లను రైతు సంఘాలకు సబ్సిడీపై అందిస్తున్నారు. గ్రామాల్లోని రైతులు తమ వ్యవసాయ అవసరాలకు వాటిని వాడుకొనేందుకు ఇచ్చి రైతు సంఘాలు అతి తక్కువ అద్దె వసూలు చేస్తున్నాయి.

జగ్గంపేట మండలంలో రైతు సంఘాలకు అందించిన పరికరాలు

జగ్గంపేట మండలంలోని 24 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకూ పలు రైతు సంఘాలకు ట్రాక్టర్లు 14, పవర్ టిల్లర్స్ 9, రోటో వీడర్స్ 12, పవర్ స్ప్రేయిర్స్ 10, పవర్ వీటర్స్ 4, వరికోత యంత్రాలు 2 సరఫరా చేశారు. వీటి ఖరీదు మొత్తం రూ1.86 కోట్లు కాగా ప్రభుత్వం సబ్సిడీగా రూ.65,32000 చెల్లించింది. యంత్ర పరికరాలు కొనగోలుకు ప్రభుత్వం గరిష్ఠంగా 40 శాతం సబ్సిడీ ఇస్తోంది. యంత్రం ఖరీదులో 60 శాతం రైతు వాటాగానూ, ప్రభుత్వ సబ్సిడీ 40 శాతంగానూ ఉంటోంది. రైతు 10 శాతం పెట్టుబడి పెడితే 50 శాతం బ్యాంకులు రుణాలుగా చెల్లిస్తున్నాయి.

రైతులకు మేలు

ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. రైతులు బయట వ్యక్తుల నుంచి దమ్ము చేయడానికి ట్రాక్టర్ అద్దెకు పెట్టుకుంటే ఎకరాకు రూ.4 వేలు ఇవ్వాలి. అదే రైతు సంఘం ద్వారా ట్రాక్టర్ అద్దెకు తీసుకుంటే ఎకరాకు రూ.3 వేల తీసుకుంటున్నారు. దీనివల్ల రైతుకు ఎకరా దమ్ముకు రూ.1000 ఆదా అవుతోంది. అలాగే వరి కోత మెషీన్‌ను ప్రైవేట్ వ్యక్తుల నుంచి అద్దెకు పెట్టుకుంటే గంటకు రూ.2800 వసూలు చేసున్నారు.

యంత్రసేవా పథకం రైతులకు వరం



వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సీడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు, ఆధునిక యంత్రాలు సమకూర్చడం ఓ వరం. మా అన్నదాత రైతు సంఘం ద్వారా రోటో వీడర్, ట్రాక్టర్ కొన్నాము. రైతులకు ప్రైవేట్ వ్యక్తుల కన్నా తక్కువ ధరకు ఇస్తున్నాం. అప్పుకూడా తీర్చేశాం. మరికొన్ని యంత్రాలు కొనాలనే ఆలోచన ఉంది.

–వైభోగుల రాజు, అన్నదాత రైతు సంఘం, గొల్లలగుంట

సాగుపై ఆసక్తి పెరుగుతోంది



గత ప్రభుత్వాలు వ్యవసాయం దండగ అన్న ధోరణితో రైతాంగాన్ని పట్టించుకోలేదు. సీఎం జగన్ ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా వారికి రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నీ అందుబాటులోకి తెస్తోంది. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేసి రైతులకు అద్దెకు ఇస్తున్నాం. ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులకు సాగుపై ఆసక్తి పెరుగుతోంది.

– మాగాపు ఆంజినేయులు,కాట్రావులపల్లి, జగ్గంపేట మండలం

కష్టాలు తీరాయి



వరి కోతల సమయంలో వేరే రాష్ట్రాల నుంచి కోత మెషీన్లు వచ్చేవి. డిమాండ్‌ను బట్టి అద్దె వసూలు చేసేవారు. జగ్గంపేటలో శ్రీనివాస రైతు సంఘాన్ని ఏర్పాటు చేసుకుని వరికోత యంత్రం కొనుగోలు చేశాం. దీంతో మా కష్టాలు తీరాయి. రైతులకు తక్కువ ధరకు అద్దెకు ఇస్తున్నాం. మరికొన్ని సంఘాలు వరికోత మెషీన్లను కొనుగోలు చేస్తే ఏటా కోతల సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.

–మింగి చంద్రరావు, శ్రీనివాస రైతు సంక్షేమ సంఘం, జగ్గంపేట

మరిన్ని పరికరాల సరఫరాకు కృషి



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ యంత్ర సేవా పథకం రైతులకు ఓ వరమనే చెప్పాలి. రైతు భరోసా కేంద్రాల పరిధిలోనే అనేక యంత్రాలు, పనిముట్లు లభిస్తున్నాయి. ప్రస్తుతం రైతు సంఘాల ద్వారానే ప్రభుత్వం యంత్ర పరికరాలు, పనిముట్లను సరఫరా చేస్తోంది. భవిష్యత్‌లో రైతులకు నేరుగా అవసరాన్ని బట్టి సబ్సిడీపై యంత్రాలు, పనిముట్లు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తోంది.

– రెడ్ల శ్రీరామ్, మండల వ్యవసాయాధికారి, జగ్గంపేట

పీహెచ్‌సీకి ఫ్యాన్ల బహూకరణ



కోటనందూరు పీహెచ్‌సీ ఆవరణలో అమర్చిన ఫ్యాన్లు

కోటనందూరు: స్థానిక పీహెచ్‌సీకి ఓ దాత శనివారం ఆరు ఫ్యాన్లు బహూకరించారు. కోటనందూరుకు చెందిన తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగా వెంకటకృష్ణాజీ తన తండ్రి వెలగా వెంకటసత్యానందం పేరు మీద రూ.20 వేలు విలువ చేసే ఆరు ఫ్యాన్లను సమకూర్చగా ఎంపీపీ లగుడు శ్రీనివాసు వైద్యాధికారి డాక్టర్ ఇందిరా ప్రియదర్శినికి అందజేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఫ్యాన్లు సమకూర్చాలని వైద్యాధికారి ఎంపీపీ లగుడు శ్రీనివాసును కోరారు. ఎంపీపీ చొరవతో దాత వెంకటకృష్ణాజీ ఫ్యాన్లు బహూకరించారు. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ములగపూడిలో నూతన పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన



ములగపూడిలో నూతన పీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

రౌతులపూడి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ములగపూడిలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి శనివారం ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రౌతులపూడి మండలం ఏర్పడి 20 ఏళ్లు గడిచినా స్థానికంగా పీహెచ్‌సీ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన వెంటనే స్పందించి ములగపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు రూ.2.45 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు తొలి విడతగా రూ.1.58 కోట్లతో భవన నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఇద్దరు వైద్యులతో తాత్కాలికంగా ఆసుపత్రి నిర్వహణ చేపట్టేందుకు స్థానిక కో ఆపరేటివ్ సొసైటీ భవనానికి మరమ్మతులు చేసి ఆసుపత్రిని ప్రారంభించామన్నారు. ములగపూడి అభివృద్ధి కోసం తమ కుటుంబం ఎనలేని కృషి చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా తమ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మండలంలోని పోలీస్ స్టేషన్ ఏర్పాటు, రౌతులపూడిలో మరో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేత అంకంరెడ్డి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కబోతతో విలవిల

- భగ్గుమంటున్న భానుడు
- అల్లాడిపోతున్న జనం



వెల్లుర్తి రోడ్డులో తలపై చెంగు కప్పుకొని ద్విచక్ర వాహనం వెళ్తున్న మహిళ

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం వాతావరణం మేఘావృతమై చల్లనిగాలులు వీచాయి. ఉదయం 10 గంటల నుంచి భానుడు తన ప్రతాపం చూపాడు. అధిక ఉష్ణోగ్రతతో పాటు ఉక్కబోతతో ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇటీవల రోహిణి కార్తె వెళ్లి మృగశిర కార్తె వచ్చింది. మృగశిరలో వాతావరణం చల్లబడుతుంది. కాగా ఈ ఏడాది మృగశిర కార్తెలోనూ ఎండలు రోహిణి కార్తెను తలపిస్తున్నాయి. ఎండ తీవ్రతను తట్టుకోలేక గ్రామాల్లోని చెరువులు, కాలువల్లో పిల్లలు జలకాలాడారు. మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉష్ణతాపాన్ని తట్టుకోలేక ప్రజలు ఆశగా వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

భానుడి భగభగలు

తొండంగి: వేసవి తపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. గత నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైబడి నమోదు కావడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకే రోడ్లపై జనం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. రాత్రి ఏడుగంటల వరకూ వేడి గాలులు వీయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నైరుతి రుతిపవనాల రాకకోసం రైతాంగంతో పాటు ప్రజలు కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. యువకులు దానవాయిపేట, అద్దరిపేట సముద్రతీరాల్లో స్నానాలు చేసి ఎండ నుంచి ఉపశమనం పొందారు.

అతిసార నివారణపై అవగాహన



గోకవరంలో అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: అతిసార వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గోకవరం వైద్య సిబ్బంది సూచించారు. స్థానిక సంజీవయ్యనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా విరోచనాలు అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓఆర్ఎస్ ద్రావణం వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మౌనిక, బేబి, పవన్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాపై ఆందోళన



కాట్రావులపల్లిలో నిరసన తెలుపుతున్న ప్రజలు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి 15 వార్డులో పంచాయతీ కుళాయిల నుంచి మురికి నీరు వస్తున్నా పంచాయతీ పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు శనివారం ఆందోళన చేపట్టారు. గత వారం రోజులుగా కుళాయిల నుంచి కలుషితమైన నీరు వస్తుండగా సమస్యను పంచాయతీ పాలకవర్గం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కాగా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై ఉద్రిక్తత



తిరుమలాయపాలెంలో విగ్రహం ఏర్పాటు చేసిన వారితో మాట్లాడుతున్న పోలీసులు



ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో అనుమతులు లేకుండా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంపై ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే.. తిరుమలాయపాలెం పంచాయతీ కార్యాలయం సెంటర్‌లోని ప్రధాన రహదారి పక్కన ఖాళీ స్థలంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఓ వర్గం అనుమతి లేకుండా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేయడంపై మరో వర్గం ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. గత బుధవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై గ్రామానికి చెందిన అంబేడ్కర్ యూత్ సభ్యులు ఆందోళన నిర్వహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి గ్రామంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో గ్రామంలో అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ శనివారం మరో వర్గం ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనుమతులు లేకుండా రాత్రి సమయంలో విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదని, స్వచ్ఛందంగా విగ్రహాన్ని తొలగించి సహకరించాలని సూచించారు. దీనికి వారు ససేమీరా అనడంతో ఇరు వర్గాల వారితో అధికారులు సమావేశం నిర్వహించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రత్తిపాడు: పేద విద్యార్థులకు సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అమోఘమని శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం ఎస్ఎంఎస్ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, శిరసాల మణికంట జ్యోతి, లక్ష్మి తదితులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కిర్లంపూడి: చిల్లంగిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం పట్టాభి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గొడే మాణిక్యాలరావు, విశాలక్ష్మి, ఉమామహేశ్వరబాబు, వరలక్ష్మి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సీతారాములకు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పట్టాభి సీతారాములను దర్శించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ

శంఖవరం: గౌరంపేట పంచాయతీ పరిధిలోని రాజాం రామాలయంలో శనివారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఎంపీపీ పర్వత రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేసి శాస్త్రోక్తంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



చిల్లంగి సీతారాములకు కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో నూతనంగా నిర్మించిన పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయంలో సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలతో పాలు పలు దేవతల విగ్రహాలు, ధ్వజస్థంభం ప్రతిష్ఠించారు. వేద పండితులు వి.శ్రీమన్నారాయణాచార్యులు, కల్యాణ చక్రవర్తి, ఎస్‌టీపీ శ్రీనివాసచార్యులు, కృష్ణమాచార్యులు తదితరులు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో భారీ అన్నదానం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

నేత్ర దానం

తుని: స్థానిక పెద్దవీధికి చెందిన దేసు సూర్యనారాయణ (56) కంటి రెటీనాను దానం చేసినట్టు రెడ్ క్రాస్ కార్యదర్శి డాక్టర్ నేరేళ్ల సత్యనారాయణ తెలిపారు. శనివారం సూర్యనారాయణ మృతి చెందగా ఆయన కళ్లను కుటుంబ సభ్యులు బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారన్నారు. మరణం తర్వాత మరొకరికి చూపు ప్రసాదించేందుకు ప్రజలు ముందుకు రావాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు.

గోరక్షణ శాలకు పశువుల తరలింపు

ఏలేశ్వరం: ఎటువంటి అనుమతులు లేకుండా కబేళాకు తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకుని గోరక్షణ శాలకు తరలించినట్టు శనివారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... తూర్పులక్ష్మీపురం గ్రామశివారు నుంచి ఎటువంటి అనుమతి లేకుండా వాహనంలో 8 పశువులను తాళ్లతో కట్టి కబేళాకు తరలిస్తున్నారు. దీనిపై పశువుల సంరక్షణ సంస్థ మేనేజర్ దేవరపు మాణిక్యలరావు ఫిర్యాదు మేరకు పోలీసులు తనిఖీలు చేసి పశువులను, వాటిని తరలించే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పశువులను కాకినాడ గోరక్షణ శాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

అటవీశాఖ సెక్షన్ అధికారి భూపాల్ మృతి

గోకవరం: మండలంలోని ఫాక్స్‌పేట రేంజ్ పరిధిలోని మొల్లేరు అటవీ సెక్షన్ అధికారిగా పని చేస్తున్న ఏలూరి భూపాల్ (58) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. 1988లో అటవీశాఖలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్‌గా విధుల్లో చేరిన ఆయన 34 ఏళ్ల సర్వీసులో పలు చోట్ల సేవలందించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం గోకవరంలోని ఇంటి వద్ద మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న రేంజర్ ఎం.కరుణాకర్, సిబ్బంది ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ సాయంగా అంత్యక్రియల కోసం రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. రైటర్ గీత, సహచర సిబ్బంది వెంకట్రావు, నూకరాజుదొర, అప్పారావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించండి

తుని: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. శనివారం ప్రజారోగ్యశాఖ అధికారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే పలు మార్లు వ్యాపారులకు నోటీసులు జారీ చేశామన్నారు. కొందరు నిబంధనలను అతిక్రమిస్తున్నారని, వారిపై అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ నిషేధం అమలుకు సహకరించాలి

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో జూలై ఒకటి నుంచి అమలు చేసే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ కోరారు. శనివారం ఆయన దేవస్థానంలో టెండర్‌ కం బహిరంగవేలం ద్వారా వివిధ క్యాంటీన్, కూల్‌డ్రింక్ షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో మాదిరిగా కేవలం గాజు సీసాలు, స్టీల్, కాపర్ బాటిల్స్‌లో మాత్రమే నీటిని విక్రయించాలని ఆదేశించారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతపై ఆందోళన

రౌతులపూడి: స్థానిక బీసీ కాలనీలో మూడురోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారంటూ కాలనీ వాసులు శనివారం స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుటు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న అన్నవరం అదనపు ఎస్సై అజయ్‌బాబు వెంటనే అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.